
పెద్దకథ

# విధి చాల సూక్ష్మమా?

శ్రీ విరించి

ప్రారంభం



'డ్రైవర్ డ్రైవర్' అంటూ కేకలేసింది ఉమ, తనగదిలోనుంచే.

మరునిమిషం వసారాలో నుంచి పని మనిషి కాంతమ్మ గదిలోనికి వచ్చింది, 'అమ్మగారూ! పిలిచారా?' అంటూ.

'నిన్ను కాదు'

కాంతమ్మ నవ్వింది.

'డ్రైవర్ మేడమీద వుండాడండీ — ఏం చెప్పమంటారు ? కారు సిద్ధం చేయమనేనా ?'

— ఉమ ఆఖరుసారి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూచుకుంది. కాంతమ్మ మాటలు విని ఆమె వంక తీక్షణంగా చూచింది. ఆఖరుకు పనిమనుషులు కూడా తనకు జవాబు చెప్పుతున్నారు !

ఆమె కోపంగా చూడడంతో, కాంతమ్మకు లోపల లోపల కొద్దిగా భయం వేసినట్లయింది. బతిమాలుతున్నట్లుగా అనునయంగా 'యేం అమ్మగారూ! అతనికేం చెప్పమంటారు ?' అంది.

'నాలుగేళ్ళనుంచి పనిచేస్తున్నావన్నమాటే గాని నీకు బొత్తిగా ఇంగిత జ్ఞానం లేదు కాంతమ్మా' చాల విసిక పట్టి అంది ఉమ.

కాంతమ్మ ముఖం చేటంత అయింది. అమ్మగారి కోసం పోయిందన్నమాటేగా!

'నాకేం తెలుస్తుందండీ-' అంది ముసి ముసిగా నవ్వుతూ.

'కారు సిద్ధం చేయమని కాకపోతే డ్రైవర్‌తో నాకు రాచకార్యాలు యేముంటాయి ?' అంది ఉమ యింకా కోపంగా చూస్తూనే.

'ఆ మాట యింతాకనే అడిగాను కదండీ. నన్ను వెరిదాన్ని చేసి...'

''ఓసి వెర్రిదానా! ఆమాట అడగాలంటే? కేక వినగానే చెప్పిరావద్దూ ?'' అంది ఉమ కుర్చీలో నుంచి లేచి నిలబడి.

'చిటికలో చెప్పివస్తానమ్మగారూ !' అంటూ కాంతమ్మ బయటకు పరుగుతీసింది.

ఉమ బల్లమీద పుస్తకం తీసి చేత పుచ్చుకుంది.

గడియారం వంక చూచింది.

సరిగ్గా నాలుగున్నర

ఇంతలో కాంతమ్మ మళ్ళీ పైకి వచ్చింది

'డ్రైవర్ లేడు అమ్మగారూ !'

'ఎక్కడకు వెళ్ళేడట ? కారు గరేజిలో వుందా లేదా ?'

'ఉన్నదండీ. టీ తాగివస్తానని చెప్పి అరగంట క్రిందట వెళ్లాడట. వేగం లాక్కురమ్మని గురవయ్యను పరిగెత్తించాను లెండి ఈ పాటికి తిరిగి వస్తూనే వుంటాడు—' అంది కాంతమ్మ యజమానురాలి పనిని తాను చాకచక్యంతో చేసినందుకు ఆమె మెచ్చుకుంటుందేమో! చూచి సంతోషిద్దామని.

'వెధవకు గంట గంటకూ టీ! సరిగా సమయానికి వుండడు. ఈ డ్రైవరందరికీ యిదే జబ్బు—' అంది ఉమ, దాదాపు అర్ధ స్వగతంగా.

'డబ్బంతా టీ దుకాణానికే యిస్తున్నట్లున్నాడండీ. ఇంటిదగ్గర పిల్లాజెల్లా—' అంటూ మొదలెట్టబోయింది కాంతమ్మ

'చాల్లే ఊరుకో, నీ సోది కూడా యిప్పుడేనా ?'

'అది కాదు అమ్మగారూ !'

'యేంటే !'

'వాడికిచ్చే నూటయాభయిలోనూ—'

'వాడి గొడవ వద్దని చెప్పానా లేదా?'

'ఆ సంసారం...'

'అబ్బ—కాంతమ్మా, నువ్వు బయటకు వెళ్ళు, వాడు వచ్చాడో లేదో చూడు-'

'రాగానే గురవయ్యను పైకి వచ్చి చెప్పమన్నాను అమ్మగారూ !'

'అన్నీ యేర్పాట్లు చేసుకునే వచ్చావన్న మాట !'

'అయినా యేంతొందరండీ అమ్మగారూ ! అప్పు యింకా రాలేదుగా !'

'మీ అయ్యే ఒకనాడయినా అన్న ప్రకారం వచ్చారుటే !'

'వారు రాకపోయినా మీరు వెడతారు గనుక వారికీ విషయమే గుర్తుండదు అమ్మగారూ!'

ఉమ విసుగ్గా చేతిరుమాలతో నుదురు తుడుచుకుంది. మళ్లీ కుర్చీలో కూలబడింది. పుస్తకం పుటలు విప్పి ఒక్క క్షణం పరికించింది.

'ఈ గురవయ్యగాడు కూడా ఆ టీ దుకాణంలోనే కూరుకుపోయినాడేమే !'

'పాపం, తీరా అక్కడకు వెళ్లిన తర్వాత ఒక అరకప్పు పుచ్చుకుందామని కుతి అయిందేమో అమ్మగారూ !'

'యేడిసినట్లే వున్నాయి నీళ ఆటలు ! అప్పుడే అయిదు గంటలయి పోయింది. నువ్వయినా వెళ్లి యిద్దరినీ యీడ్చుకురా.''

కాంతమ్మకు మళ్లీ యీ మారు తప్పలేదు.

ఎంత యిష్టం లేకపోయినా ఆ విషయాన్ని ముఖంలో కనిపించనీయకుండా మెల్లగా బయటకు నడిచింది.

జూబిలీ క్లబ్బులో సాయంత్రం ఆరుగంటలకు గొప్పపార్టీ జరగబోతోంది. దానికి సకాలంలో అందుకునేట్లు వెళదామని ఉమ తాపత్రయ పడుతోంది.

'ఇంకా అయిదేనా కాలేదుగ! ఓ పావు గంటసేపు వారి కోసం ఎదురుచూచి మరి వెడతాను' అనుకుంది.

అబ్బ ! ఎదురుచూడడం అంటే ఒకటే తలనెప్పి.

ఎంతసేపని ఎదురుచూడడం ? ఎంతకాలమని యిలా...ఎంతమంది కోసరం ?

ఆయన యింకో పావుగంటకు ఇంటికివచ్చిన చాలు. ఒక పదినిమిషాలలో అక్కడకు చేరుకుంటారు. అయిదునిమిషాలు ముందుగానే చేరుకుంటారు. అతిథులందరినీ ముందుగానే పలుకరించవచ్చు. కొత్తవాళ్లను పరిచయం చేసుకోవచ్చు. ఏదీ, యింతకు ఆయనగారు వస్తే గదా !

చెప్పిన టైముకు ఎప్పుడు వచ్చారు గనుక ?

ఏవో పనులు, యేవోసాకులు— చెబుతారు. ఈ ప్రపంచాన్నంతా తామే భరిస్తున్నట్లు, యేలుతున్నట్లు చెబుతారు. అన్నీ నిజమేనేమో ! ఎవరికి కావాలి ? అన్న టైముకు రారు. అన్న ప్రకారం చేయరు. తను ముందుగా చెప్పిందంటే మరీ జాప్యంచేస్తారు. ఒట్టి బద్ధకం ! కాదు, తమకు కావలసినవన్నీ టంచనుగా టైం ప్రకారం చేసుకోవడంలేదూ? తను చెప్పిన పనులు చేయడానికి ఆయనకు ఎక్కడలేనిబద్ధకం వచ్చేస్తుంది. ఎక్కడెక్కడి తొందరపనులు, తమ కోసమే కాచుకొని వుంటాయి. ఆయనకు ఆ ధ్యాస వుంటేగా అసలు !

ఎంత ముచ్చటగా జరుగుతుంది పార్టీ !

ఎందరెందరు స్నేహితులు వస్తారు !

అందరినీ మళ్లా ఎన్నాళ్ళకో ఒక్కచోట ఒక్కమారుగా చూడడం జరిగేది !

అధికారం వున్నందుకు— అలంబన చిక్కినందుకు యేమిటి ఫలం, యిటువంటి పార్టీలకు వెళ్లకపోతే !

ఏమిటో ఆయనకు యీ ధ్యాసే వుండదు.

చెప్పినా వినరు, పట్టించుకోరు...

కాంతమ్మ వచ్చింది.

'డ్రయివర్ వచ్చాడు అమ్మగారూ! కారు ఎప్పుడో రెడీగా వున్నదట. రండి' అంది.

ఉమ గడియారం వంక చూచింది, అప్పుడే అయిదున్నర అయింది.

బయలుదేరబోయి, ఉమ మళ్లీ ముఖం అదోలా పెట్టి 'యింకోపావుగంట ఆగి బయలుదేరుతాను—'అంది.

కాంతమ్మ నవ్వింది.

ఉమ కోపంగా చూచింది.

పనిమనిషి ! ఎందుకలా కోతిలా నవ్వుతుంది ?

తనంటే చులకనా ? కాదు ! తిడితే యేడుస్తుంది మళ్లీ.

దీన్ని సాగతీయలేక తల్ప్రాణం తోకకు వస్తుంది తరువాత; పోనీలే నవ్వనీ !

'అమ్మగారికి ఆత్రం జాస్తి. ఇందాకటి మంచి నా ప్రాణం తోడేశారా ? తీరా కారు రెడీ అయేటప్పటికి యింకో పావుగంట అంటున్నారు' అంది కాంతమ్మ — గోడకు జారగిలపడి కూర్చుంటూ.

'మీ అయ్యగారు వస్తారేమోనని చూస్తున్నానే—'

'మరి అంత తొందర పెడితిరి ! పాపం, గురవయ్య టీకప్పు సగంలోనే వదిలి లగెత్తుకు వచ్చాడు.'


'యేడవలేకపోయినాడు. ఏ పనీ చెప్పిన చేయడం చేతకాదు. పట్టి నిద్రమత్తు మనుష్యులు—'

'అంతేనండి అమ్మగారూ! వాడికి చెప్పిన యే పనీ ఒకంతట పూర్తికాదు—'

ఉమకు యీ కబుర్లంటే విసుగు.

కాంతమ్మ వద్దన్నా చెబుతుంది.

'ఎవరూ వినకుండా వుంటేనే దానికి బోలెడన్ని కబుర్లు పుట్టుకు వస్తాయి. కోరి చెప్పించుకుంటే యింకా ఎన్ని చెప్పగలుగుతుందో !'






## నిధి చాల సుఖమా?

ఉమ ఆలోచనలు మళ్ళీ కదిలాయి—

ఆయన యింకా యిల్లు బయలుదేరి వుంటారా ?

సగం దారిలో వుంటేచాలు ... మరో అయిదారు నిమిషాలలో యింటికి వచ్చేస్తారు. అవును.. తాను కాస్సేపు వేచి వుండడం మంచిపనే చేసింది. ఇద్దరూ కలిసి చక్కగా వెళ్ళి రావచ్చును. ఆయన కూడా వుంటే తనకెంత హాయి! పరాయి చోటుకు వెళ్తే పలుకరించే వాళ్ళు ఉన్నా, లేకపోయినా ఆయన పక్కన వుంటే తనకు ప్రాపంచిక మయిన విషయాలేమీ పట్టవు అవన్నీ ఆయనే చూచు కుంటారు తను ముచ్చట్లు చెప్పుకుంటూ ఊహాలోకంలో—ఆనందంగా హాయిగా తేలిపో వచ్చును. ఏరీ ! యింకా రాలేదే ! ఇంకేం వస్తారు ? పుణ్యకాలం కాస్తా పూర్తయి పోతూ వుంటేనూ ?

అబ్బబ్బ ! ఈ మనిషితో యిదే చిరాకు.

ఉమ యిలా ఆలోచనలతో సతమతం అయిపోతూ వుండగా కింద కారు హారన్ మోగింది.

'ఎవరో వచ్చారు అమ్మగారూ !' అంది కాంతమ్మ.

'ఎవరో చూడిరా.'

కాంతమ్మ బాల్కనీ వయిపు వెళ్ళి కిందకు చూచింది.

'మీ స్నేహితురాలు — ఇందిరమ్మగారు వస్తున్నారండీ !' అని ఉత్సాహంగా చెప్పింది.

'ఇందిరా ! గుడ్...' అనుకుంది ఉమ. ఇంతలో ఇందిర మేడపైకి రానేవచ్చింది. ఉమ గుమ్మంవరకూ వెళ్ళి స్నేహితురాలికి స్వాగతం యిచ్చింది.

'రా... ఇందిరా ... రా ... సమయానికి దేవతలా వచ్చావు.'

'అదేమిటే ఉమా ? యేమిటా శుభ సమయం ?'

'మువ్వు రావడం కంటే శుభం యింకేం వుందమ్మా !!' అని ఉమ కాంతమ్మతో 'కిందికి వెళ్ళి వంటమనిషి నడిగి రెండు కప్పులు కాఫీ పట్టుకురా' అంది.

'ఇప్పుడెందుకు ఉమా, నేను యింటిదగ్గర తీసుకునే బయలుదేరాను. ఏమిటే, యెక్కడికో వెళ్ళటానికి తయారయి నట్లున్నావే ఏం విశేషం ?'

ఈ మాటలతో ప్రసక్తి లేకుండానే కాంతమ్మ కిందకు వెళ్ళింది కాఫీ తీసుకు రావటానికి

'ఇవాళ జూబిలీ క్లబ్బులో గొప్ప విందు ఇందిరా! మహారాష్ట్రదేశం నుంచి ఎవరో పెద్ద చిత్రకారుడు వచ్చాడట! ఆయన గౌరవార్థం. అక్కడకు వెడదామని తయారయి ఆయనగారి కోసం ఎదురుచూస్తున్నాను'

'అలాగా! శ్రీవారికోసం ఎదురుచూస్తూ వుండగా పానకంలో పుడకలాగ నేను తారసిల్లానన్నమాట!'

'ఫో, యిందిరా! నీ సోచుకోలు మాటలు పోనిచ్చావు గాదు' అంది,

ఉమ కాస్త సిగ్గుపడ్డట్లు అభినయిస్తే బాగుంటుందని ప్రయత్నం చేస్తూ.

'అలాకాదు, నిజం చెప్పు'

'యేమిటి?'

'ఈ పళంగా మీ శ్రీవారు వస్తే నన్ను అర్ధాంతరంగా వదిలేసి క్లబ్బుకు వెళతావా లేదా?'

'వస్తే — గిస్తే ... వారి సంగతి నీకు తెలియదు గనుక అలా అంటున్నావు. నాతో పాటు క్లబ్బులకు, కాలక్షేపాలకు వస్తారనేనా నీ వుద్దేశ్యం?'

'నా వుద్దేశ్యం అలా వుంచు. ముందు నీ మాట చెప్పు—'

—కాంతమ్మ ట్రేతోసహా వచ్చింది.

ఇందిర కాఫీ కప్పు అందుకుంటూ 'పాపం మీ వారికోసం వుంచిన కాఫీ నా పాలిట పడింది పోనీ యేంచేస్తాం, చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవ అన్నారు' అంది

కాఫీ తాగడం పూర్తిచేసి ఉమ 'యేం గాలివానలా వచ్చావు ఇందిరా, యేవిటి విశేషాలు' అంది.

'యేమీలేవు. చాలకాలం అయింది గదాని నిన్ను చూచిపోదామని వచ్చాను.'

'పాపం! వింత ప్రేమ!'

'పోనీ అలాగే అనుకోవే! నిజంచెబితే యీ రోజులలో ఎవరికీ నమ్మబుద్ధికాదు.' అంది ఇందిర.

'అబ్బ! హరిశ్చంద్రుడి చెల్లెలు...! సరేగాని?, వారు వచ్చేట్లులేదు, లేటయిపోతోంది. పోదాంపద—'

'పద— నిన్ను క్లబ్బుదగ్గర డ్రాప్‌చేసి నేను యింటికి వెడతాను—'

'అలా నిన్ను వెళ్ళనీయకేం. నాతోపాటు నువ్వూ క్లబ్బుకు రావాలి!'

'ఒద్దు ఉమా! నాకు పరిచయం లేని మనుష్యుల మధ్య నేనెందుకు — నాకు యిష్టం వుండదూ.'

'పరిచయానికేముంది? ఇప్పుడు చేసుకుంటే పోలా? నాతోరా, నీ పిరికితనం వదలగొడతాను—'

'అలాకాదు. నేను యివాళ రానులే. మరోరోజు చేసుకుందాం'

'యేం, యివాళయేదయినా దుర్ముహూర్తం వుందా? లేక మీవారితో యేదయినా ప్రోగ్రాం వేసుకున్నావా?'

'ఉహూ మావారు ఊళ్ళోలేరు. పనిమీద మదరాస్ ఎళ్ళారు. ఎల్లుండికిగాని రారు—'

'అయితే యింకేం — నువ్వు తప్పకుండా రావల్సిందే! అందరికి నిన్ను పరిచయం చేస్తాను పద'

ఇందిర తనకు రావడం కుదరదని ఎంత వాదించిన ఉమ వినేటట్టు లేదు. ఏమంటే రాకపోవటానికి ఇందిరకూ గొప్పకారణాలు లేవు. తనకు తెలియని వాళ్ళతో విందు ఎందుకని ఆమెబాధ. ఒకసారి తెలుసుకుంటే తెలియవాళ్ళు మిగలకుండా పోతారని ఉమ పూచీ.

'అయినా యిలాంటి సోషల్ గాదరింగ్స్ అంటే నువ్వు ఎందుకు అలా బిరుసంగా వుండిపోతావు ఇందిరా? నీ చలాకీతనం అంత యేమయిపోతోంది నలుగురిలోకి వస్తే! మన ఎడ్యుకేషన్‌కీ—మన కల్చర్‌కీ నలుగురితో కలిసి తిరక్కపోతే, మెలక్కపోతే ఎందుకింకా యీ అడివి జీవితం? రోజల్లా యింట్లో పడికూచుంటే ఏట్లాతోస్తుంది గనుక? మన సోషల్ స్టేటస్‌కు ఊళ్ళో పెద్దలందరితోనూ పరిచయం లేకపోతే రాణింపు యేముంది? కూపస్థ మండూకంలాగ ఒకచోట పడివుండటానికా మనకు యీ సిరిసంపదలు భోగభాగ్యాలు, ఎందుకు యిచ్చాడంటావు భగవంతుడు?—' అంటూ ఉమ ఇందిరకు ధైర్యంచెప్పి ప్రయాణం చేయించింది.

'కాంతమ్మ, కాంతమ్మ — డ్రయివర్‌ను కారు బయటకు తీసుకు రమ్మను—'

'మళ్ళీ నీకారు ఎందుకు ఉమా! నేను కారులోనే వచ్చాగా! దాన్లోనే వెడదాం—' అంది ఇందిర.


'తిరిగి వచ్చేటప్పుడు—డ్రయివర్‌ను కారు తీసుకురమ్మంటాను—'

'ఎందుకు లెద్దూ, ఒక గంటసేపట్లో తిరిగి వచ్చేస్తామంటున్నావుగా! నా కారులోనే నిన్ను దింపి వెడతానులే. మళ్ళీ మీ వారికి కారు కావలసి వస్తుందేమో!'

'వారికికావాలంటే ఆఫీసు కారు వుందిలే.'

'రాద్దూ నా కారులో వెడదాం—' అంటూ ఇందిర ఉమను కిందకు లాక్కువెళ్ళింది.

ఇద్దరూ కారు దగ్గరకు నడిచొస్తారు



వరములు బలహీనత, గుప్త రోగములకు

**ఉత్తమ చికిత్స!**



పెండ్లికి ముందు, పెండ్లి తర్వాత సంప్రదించండి.

**Dr.Z.H. ROY** (Govt Rdgd)
**Dr. K. Kesava Rao,** (GovtRegd)

**ఆసియా క్లినిక్**

ఆర్.టి.సి. క్రాస్‌రోడ్
సంధ్యాటాకీస్ ఎదుట,
హైద్రాబాద్ - 500020.
కృష్ణాటాకీస్ వద్ద, కడప - 1.



ఆంధ్రుల అభిమాన రచయిత్రి

## కావిలిపాటి విజయలక్ష్మి

## నవలలు

| | |
|---|---|
| చక్రపాణి | 11 00 |
| తృప్తి | 7-00 |
| గెలుపు | 8-00 |
| రాము | 8-50 |
| లలితాదేవి | 12-00 |
| ఈ ప్రేమ కథ ఇంతే | 12 00 |
| అరుణ కిరణాలు | 11-00 |
| మారిన మనసులు | 11-00 |
| తెరల వెనుక | 6-00 |
| సంఘర్షణ | 5-00 |
| రాగవల్లరి | 6-50 |
| వాగ్దానం | 8-00 |
| గులాబి ముళ్ళు | 8-00 |
| మనసు—మనువు | 10-00 |
| జీవనరాగంలో మధుర శృతులు | 12-00 |

మీకు కావలసిన పుస్తకాల ధర M.O. పంపండి. 25 పైసలకు వి.పి. పంపుతాము.

## క్వాలిటీ పబ్లిషర్స్,

రామమందిరం వీధి, విజయవాడ-2.


## నిధి చాల సుఖమా?

ఇందిర డ్రయివర్ సీట్లో కూర్చుంది.

ఉమ ఆమె సరసనే కూర్చుంది.

కాంతమ్మ అమ్మగారి దగ్గర సెలవు తీసుకుని తిరిగి యింటిలోనికి వచ్చింది. గురవయ్య తోటకు నీళ్ళు పడుతున్నాడు. డ్రయివర్ కారు గారేజిలో పెట్టేసి తాళం వేసుకుని మళ్ళీ టీ దుకాణం వయిపు వెళ్ళిపోయాడు.

* * *

'మీ శ్రీవారు సరాసరి క్లబ్బుకే వస్తా నన్నారా?' అనడిగింది ఇందిర.

'బహుశ రారనుకుంటాను. వస్తే యింటికే వస్తానన్నారు. అందుకనే యింత సేపు ఎదురు చూచాను. వారికి యిలాంటి ఫంక్షన్స్ అంటే అట్టే ఆసక్తి లేదు.'

'నీ కోసమన్నా ఆసక్తి కలిగించుకోవద్దూ?'

'నా కోసమా?...అవును...నాకోసం...' అంటూ ఉమ ఆలోచనలో మునిగిపోయింది.

రెండుక్షణాలు ఊరుకుని ఇందిర మళ్ళీ అడిగింది: 'యేం, ఉమా! అంత ఆలోచనలో పడిపోయావ్? ఇదంతా ఆయనగారు రానందుకు విచారమే!'

'యేమిటి ఇందిరా, చిన్నపిల్లలా చిలిపి మాటలు-'

'పోనీ కాదని చెప్పరాదూ?'

'అవు తేనేం-కాకపోతేనేం- నీకెందుకు?'

'అంతకోపం అయితే ఆ ప్రసక్తి తీసుకు రానులే.'

'అదికాదే ఇందిరా! ఆయనగారుచూడావా? అన్నప్రకారం రానయినాలేదు.'

'యేదన్న పనివుండి ఆగిపోయారేమో!'

'అదే నేననేది! వారికి నాకంటే తతిమ్మా అన్నిపనులూ ముఖ్యం-'

'ఛ! అదేమిటి? అంత నెర్వస్‌గా మాట్లాడతావు! అయినా ఆయనగారు తప్పకుండ వస్తానన్నారా?'

'అనలేదనుకో అయినా రావద్దూ?'

'బాగుంది! అసలేమన్నారు చెప్పు-'

'రావడానికి ప్రయత్నిస్తాను. బహుశ కుదరదనుకుంటాను. ఏ మాత్రం వీలు చిక్కినా వస్తాను. నేను ఒకవేళ రాలేకపోయి నట్లయితే మళ్ళ డ్రయివర్ను తీసుకుని మనకారులో వెళ్ళు అన్నారు-!'

'యింకేం మరి! ముందే చెప్పారుగా.'

## ఇది ఇంతే మరి!

క్యాన్సర్ నిర్మూలించే
సర్వవేది కనిపెట్టాను.
కాస్తేమీ లేకుండానే
ఉచితంగా పంచిస్తాను.
పథ్య పానమేమీలేదు
ఏమైనా తినవచ్చు.
ఒకే ఒక్క షరతుందైతే
అది కూడా చెప్పేస్తాను.
న్యూస్ పేపర్ ముక్కల్లోనే
ఔషధాన్ని సేవించాలి
ఆ న్యూస్ పేపర్లో—
మానభంగాలు — వి
మానహైజాకింగులుండరాదు
రైలు బస్సు ప్రమాదాలు
దారిదోపిడీలుండరాదు.
పార్టీఫిరాయింపులు
నాయకుల ప్రగల్భాలుండరాదు
ఇది ఇంతేమరి!

— సురా శర్మ

'యిది గ్రామఫోన్ ప్లేట్. ఏ సోషల్ ఫంక్షన్‌కు వెళ్ళవలసివచ్చినా యిలాగే చేస్తారు. ఆఖరుకు సినిమాకయినా అంతే!'

'వారికి తీరదేమో మరి! పెద్ద ఉద్యోగం కదా!'

'ఒక్కరేనా యేం ఉద్యోగం చేస్తున్నదీ! ప్రపంచంలో తతిమ్మావాళ్ళంతా వాళ్ళవాళ్ళ స్వంతపనులు చూచుకోకుండా అస్తమానం ఆఫీసుకు అంటుకుపోయి కూర్చుంటున్నారా?'

'అయితే వారికి యిలాంటివి యిష్టం లేవేమో!'

'నీకు తెలియదు — చెవికోసుకుంటారు! తీరదట, తీరదు! ఆఫీసులో ప్రణాళికలు వేయడంతోటే ఆయన టైమంతా ఖర్చయి పోతుంది. ఇంక నాకోసం బజారుకేం వస్తారు?'

'పోనీలే మనవ్వొక్కదానివే వెళ్ళగలవుగా!'

'వారు పక్కనుంటే వచ్చేహుందాతనం, నాకు వంటరిగా ఎలావస్తుందే! వారివి




దీర్ఘవ్యాధులకు ఉత్తమవైద్యం
దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యం పొందలేనివారికి హెర్నియా, చర్మవ్యాధులకు పోష్టుద్వారా వరిబీజం(బుడ్డ) ఇస్నోఫిలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ(గ్యాస్ట్రిక్) మూత్ర,స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి
డా॥ దేవర
3/1 బ్రాడీపేట, గుంటూరు A.P.

బైద్యనాథ్ వారి సమర్పణ
బైద్యనాథ్
మాదీఫల రసాయనము



సదుపాయకరమైన 60 మి. లీ. మరియు 200 మి. లీ. ప్యాకింగులలో అన్ని మందుల దుకాణములలో లభించును.

శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్ ప్రపంచమునందలి అతి పెద్ద ఆయుర్వేద ఔషధ నిర్మాణ సంస్థ నేడు ప్రజాసేవలో "బైద్యనాథ్ మాదీఫల రసాయనము"ను ప్రవేశ పెట్టుచున్నారు. అజీర్ణము, అగ్నిమాంద్యముల యందు మరియు పైత్యవికారము, వాంతులయందు అత్యుత్తమముగా పనిచేసి జీర్ణశక్తిని పెంపొందించుటలో మేటి అయిన రుచికరమైన ఔషధము.

విక్రయకేంద్రము 21-7-802, హైకోర్టుఎదురుగా హైదరాబాద్-2
ఫోన్ నెం : 47068

శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్

బైద్యనాథ్ ప్రాచీన ఆయుర్వేద గ్రంథములననుసరించి 700 రకముల ఆయుర్వేద ఔషధములు కలకత్తా, పాట్నా, ఝాన్సీ, అలహాబాద్ మరియు నాగపూరులలోని 5 కర్మాగార ములలో అత్యంత అధునాతన పద్ధతిలో తయారుచేయబడు చున్నవి.

బైద్యనాథ్ ఔషధాలు 800 విక్రయశాలలు మరియు 60,000 ఏజన్సీలు మరియు ఔషధ విక్రేతలద్వారా భారతదేశమంతటా లభించుచున్నవి.

INTERMARK/MPR 18T

## నిధి చాల సుఖమా?

చూసేగా నాకు యీ సోషల్ స్టేటస్! ఇదంతా నా స్వంతమా యేం ?'

'పోనీ వెళ్ళడం మానివేయరాదూ?'

'అదే నీ తెలివితక్కువ. వెళ్ళకపోతే మన ప్రెస్టీజ్‌కు భంగం కదూ? రేపు ఏవేళ్ళయిన మనని మనుషుల్లా చూడాలా అక్కర్లేదా ?'

'ఆ! చూడకేం చేస్తారు లెద్దూ. వాళ్ళకోసం మనం బతుకుతున్నామా ?'

'నీకు అర్థం కావులే యీ బాధలన్నీ, అనుభవిస్తున్న దాన్ని నాకు తెలుసా నీకు తెలుసా ?'

'అర్థం కాకపోతే పోనీ, మరేదయినా సంగతి చెప్పు—'

—వాళ్ళిద్దరూ యిలా ఊసులాడుకుంటూ వెళ్ళేసరికి గమ్యస్థానం రానేవచ్చింది.

క్లబ్బు ముందు కారు ఆగింది.

ఉమ ముందు కిందకు దిగింది.

ఇందిర కారును ఆవరణలో పార్క్‌చేసి ఉమను కలుసుకుంది. ఇద్దరూ లోపలి హాలు లోనికి వెళ్ళారు.

'రండి-రండి'

అప్పుడే హాల్లో జనం నిండిపోయినారు.

'ఆలస్యం అయింది క్షమించండి' అంది ఉమ, అందరిలో కొందరినుద్దేశించి.

'లేదు-లేదు, ఆలస్యం కాలేదు.'

'అయినా నువ్వు కూడా యింత ఆలస్యం చేయడం...యేంబాగుంది ?'

'ఏప్పటిలాగ మీ శ్రీవారు రావేలేదా ?'

'మనకు ఎవరో కొత్త మెంబర్ను తీసుకు వచ్చేనే !'

'ఈ జార్జెట్ చీర మీ వంటికి బాగా నప్పుతుంది.'

'మీరు రాకపోతే యింతవరకు సభకు నిండే యేర్పడలేదు.'

యిలా తెలిసిన వాళ్ళందరూ ఒకరువేయని పరామర్శ మరొకళ్లు చేస్తున్నారు.

అందరికీ సమయోచితంగా జవాబులు చెప్పి ఉమ తనకోసం నిర్దేశించిన స్థానంలో కూర్చుంది. ఇందిర యేమీ మాట్లాడకుండా ఆమెనే అంటిపెట్టుకు వుంది.

ఇంకా కొందరు ప్రముఖులు రావాలట. వాళ్ళకోసం వేచివున్నారు. సభా ప్రారంభానికి కొద్దికాలం ఆలస్యంవుంది. ఎక్కడికి వెళ్ళినా ఎవరిని చూచినా వేచివుండడంతోటే కాలం

అశోకా పెన్స్
& బాల్ పెన్నులు
REGD. No. 143646
అశోకా పాళీలు
లాంగ్ లైఫ్ పాయింట్లతో
తయారుచేయబడుచున్నవి.
అశోకా పెన్ వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)






సంతానము
గర్భాశయ వ్యాధులు
సుఖప్రసవము
సెక్స్ ఆంతరంగిక
సమస్యలు
మొలలు, చర్మవ్యాధులకు
అనుభవ చికిత్స.
పోస్టుద్వారా చికిత్సకలదు.
సరోజ నర్సింగ్ హోమ్
డా. ఎస్. సరోజినీదేవి - డా. వి. మధు
(సెక్సు స్పెషలిస్ట్)
(H.O. శ్రీనివాసమహల్, గణపతిరావురోడ్ విజయవాడ-2
బ్రాంచి: జిన్నాటవర్, శ్రీరంగనాయకవీధి, గుంటూరు.)


# భాష్యంకందని భావం


భోగం భాగ్యం కాదు
భాగ్యం ఆర్జన కాదు
మంచితో ఆర్జించు కీర్తిని
ఆ కీర్తితో అనుభవించు తృప్తిని
ఇది చరిత్ర తెలుసుకోని సత్యం
భాష్యం చెప్పలేని అర్థం!

— ఎస్. రోహిణి


రూపానికి రూపం-గుణానికి గుణం!


ఫిలిప్స్
వేలియంట్ 4 బ్యాండ్లు
• ఫుడ్ ఫాయిల్ ప్రింటెడ్ గ్రిల్
• స్లైడ్ కంట్రోల్స్
• క్రోమ్ పుష్ బటన్లు
• సులభంగా కరంటుకు మార్చుకోవచ్చు
రూ. 615
*సిఫారసు చేయబడిన వెల,
ఎక్సైజ్ డ్యూటీతో సహా. స్థానిక పన్నులు అదనం.
ఆడియో విజన్, ప్రకాశంరోడ్, విజయవాడ—2. ఫోన్ నెం. 76369


SWATHI
వినూత్న సాంప్రదాయానికి నాంది
స్వాతి
* సర్వోన్నతమైన నాణ్యత
* సర్వోన్నతమైన పనితనం
* సర్వోన్నతమైన సుందర రూపం
దేశంలో 7 సం.లు గ్యారంటీతో లభించే
ఒకే ఒక కుట్టు మిషన్
మీ ఇంటికే అలంకారం.
SWATHI
సుదృఢమైన నిర్మాణానికి ప్రతీక


# నిధి చాల సుఖమా?

కాస్త హరించిపోతోంది. ఒకళ్ళకోసం ఎదురు చూడడంతోనే జీవితకాలంలో ఎక్కువకాలం వినియోగం అయిపోతోంది. ఒక్కొక్కసారి జీవితకాలమంతా ఎదురుచూడడంతో సరిపోతుంది. ఇలా చూసుకుంటూ పోతే జీవితకాలం కూడా చాలక పోవచ్చును ఉమకు యివన్నీ తలుచుకుంటే, ఎదురుచూడడం అనేది తనకొక్కదానికే కాదు — ప్రపంచానికంతటికీ వున్న సమస్యలా గోచరించసాగింది. అయినా తన విషయం ప్రత్యేకం. ప్రతిసారీ ఎదురుచూడడమే! దేనికోసం? నిరాశ నిస్పృహల కోసమే గదూ!

నిష్కారణంగా తనశక్తినంతా ఎదురు చూడడంకింద వృథాచేసేస్తోంది. చివరకు తన ఆలోచనలు — తను మిగిలేటట్లు ఎదురు చూడడం తనకు జీవితంలో పరిపాటి అయిపోతుంది. అంతే!

ఉమ — యిందిరకు ఇక్కడ చేరిన పెద్ద వాళ్ళందరిని గురించీ చెప్పింది. తనకు బాగా పరిచయం వున్నవాళ్ళతో ప్రత్యక్షంగా పరిచయం కూడా చేయించింది

అందరూ గొప్పగొప్ప ఉద్యోగస్తులు; ప్రయివేట్ కంపెనీల భాగస్వాములు, జమిందారులు, శ్రీమంతులు...!

ప్రభుత్వాన్ని నడిపించే వాళ్ళంతా యిక్కడే ...న్నారు.

...రీలు, డైరెక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, డాక్టర్లు... ప్రముఖులను యెవరిని కలుసుకోవాలన్నా, సరాసరి యిక్కడకు వచ్చేస్తే సరిపోతుంది. — అనిపించింది ఇందిరకు.

(ఇంకా ఉంది)

పెద్దకథ

# నిధి చాల సుఖమా?

శ్రీ విరించి

(గత సంచిక తరువాయి)

ఇప్పుడు ఇందిరకు—ఉమ యిందాకటి నుంచి పడిన మానసిక వేదన అర్థం కావచ్చింది.

అవును మరి!

ఉమ భర్త ప్రసాద్ కూడా గొప్ప ఇంజనీయరు కదా!

ఇక్కడున్న వాళ్ళతో సమ ఉజ్జీగా — ఒక మెట్టు ఎక్కువగానే-కూర్చోవటానికి అర్హత, అవకాశం, అధికారం వున్నవాడే గదా! అందు కనే అతను రానందుకు ఉమ అంతగా పరిత పించింది—అనుకుంది ఇందిర.

విందుకు వచ్చినవాళ్ళలో చాలమంది ఉమను 'మీ వారు యేరీ?' అనడగడం కూడా గమ నించింది—ఇందిర.

కొందరు 'ఊళ్ళో లేరా? విటయినా ఇన్స్పెక్షన్‌కు వెళ్ళారా? ఎందుకు రాలేదు?' అని గుచ్చి గుచ్చి అడిగినప్పుడు ఉమ అభిమా నంతో ముఖం కిందకు దించుకుని యేదో జవాబుగా నణుగుతుంది. ఏంజవాబు చెప్పాలో ఆమెకే అర్థం కాదు. వాళ్ళకేం చెబుతుంది? 'వారు రాలేదు'అన్నది ఇంతవరకు వివాదాంశం కాని సత్యం.

కాని విందుకు రాలేదు అన్న ప్రశ్నకు సరయిన సమాధానం తనకేం తెలుసును?

ఏం తెలుసునని తను వాళ్ళకు సమాధానం చెబుతుంది.

ఏదో జవాబు చెప్పాలి గనక చెప్పడం— అంతే!

పాపం ఉమ పడిన అవస్థ చూస్తోంటే ఇందిరకు చాలా జాలేసింది. ప్రసాద్ ఆమెను చాలా బాధ పెట్టినట్లే లెక్క— అనుకుంది ఇందిర. మళ్ళీ వివేకం తెచ్చుకుని, ఒక తరపు వాదనే విని తీర్పు చెబుతున్నట్లు గమనించు కొంది. ఏమో! అతను విందువేళ రాలేక పోయినాడో! వేరే యేదో పెద్ద పని వుంటే తప్ప— ఏవరేనా విదేశీ ఇంజనీర్లను కలుసు కోవడమో— లేక పెద్ద ప్రాజెక్ట్‌కు డిజైన్లు వేయడమో— ఏ మంత్రుల సమాలోచనలలో పాల్గొనడమో- చేస్తూ వుండి వుంటాడు. నిజానికి ఆ పనులన్నీ యీ పార్టీ కంటే గొప్పవే గదా, అయినా అదంతా అతని మనస్సుకు. అవేవీ ఊహించలేని ఉమకు కాదు అనుకుంది ఇందిర.

ముందు దిగులుగా కూర్చున్న ఉమ— వాళ్ళు వీళ్ళు వచ్చి ఏవేవో మాటలలోనికి దింపడంతో ఆ హడావిడిలో పడిపోయింది. ఇందిర ఇదంతా గమనిస్తూ వున్నది గాని ఆమె మనసు మటుకు యిక్కడ లేదు. ఉమను గురించే ఆమె ఆలోచనలన్నీని.

విందును చక్కగా 'ఎంజాయ్' చేస్తోంది ఉమ, కాని, ఆ సంతోషం అట్టడుగున 'వారు తన సరసన లేకపోయినారే' అన్న సంతాపం ముసుగు వేసుకొని వుండనే వుంది!

క్రమంగా ఇష్టాగోష్ఠి, కబుర్లన్నీ అయి పోయినాయి.

సమావేశం ప్రారంభం అయింది.

ఎలుగురయిదుగురు ముఖ్య అతిథిని గురించి మాట్లాడారు. ఆయన కళా నైపుణ్యాన్ని గురించి, వైవిధ్యాన్ని గురించి ప్రస్తావించారు తరువాత ఆ చిత్రకారుడు ఉచితరీతిని సమాధానం చెప్పాడు. తన చిత్ర రచనకు ఆలంబన అంతా ప్రకృతే నన్నాడు తనకు చిత్రకారుడుగా యేమన్నా ప్రఖ్యాతి వుంటే[ఉన్నదని అతనికీ తెలుసును.] అదంతా ప్రకృతి కటాక్షమే అన్నాడు. తగినంత ప్రోత్సాహం, బలంవుంటే తన విద్యను విస్తృతం చేసుకుని మరింత కళాసేవ చేస్తా నన్నాడు. తన కళామయ జీవితం సార్థకం జేసుకుంటానన్నాడు.

అందరూ చప్పట్లు చరిచారు.

కార్యక్రమ మంతా హుషారుగా చక చక నడిచిపోయింది.

అంతా పూర్తయేసరికి ఏడున్నరఅయింది.

అందరి దగ్గరా సెలవు తీసుకుని వాళ్ళిద్దరూ యింటికి బయలుదేరారు.

'ఎలా వుంది ఇందిరా?'అనడిగింది ఉమ

'ఏమిటి?' నిజంగానే ఇందిరకు ఆ ప్రశ్న అర్థంకాలేదు.

'అదే యీ సంరంభం.'



## విధి చాల సుఖమా?

'బ్రహ్మాండంగా వుంది. కాని ఓ పెద్ద లోపం!'

'ఏమిటో.'

'మీ శ్రీవారు రాకపోవడం.'

'అంతే కదా!'

—ఆ ప్రసంగం అక్కడితో ఆగిపోతే సరి పోయేది, కాని మళ్లీ ఇందిరే ప్రారంభించింది.

'ఇంతకూ మీవారు రాకపోవటానికి యేదో బలమైన కారణం వుండి వుంటుంది, ఉమా! లేకపోతే యింత గ్రాండ్ రిసెప్షన్‌ను మిస్ అవరు—'

'ఈ కారణాలు విని విని నా చెవులు చిల్లులుపడిపోయినాయి. అంతే ననుకో—'

'ఆ స్థితిలో నిన్ను చూస్తేనాకు చాలా జాలేసింది సుమా!'

.'థాంక్స్! అలవాటు అయిపోయినా నాకు బాధపడడం మాత్రం తప్పడంలేదు.'

'వారికి అంతగా తీరుబడి దొరకనప్పుడు యేంచేస్తాంలే—'

'అక్కడే నేను వొప్పుకోను...'

'తీరిక దొరకడం అంటే అది ఎవరిచేతిలో వసంటావు? కావాలంటే దొరుకుతుంది, లేకపోతే లేదు. ఇంతకూ వారికి నాతోపాటు రావడం యిష్టంలేదేమో! అంతే అను కుంటాను నేను. ఇంకేం చెప్పినా నమ్మను.'

'చాల పరుషంగా మాట్లాడుతున్నావు! నీతో రావడం వారికి యిష్టం లేకుండా వుంటుందా? ఏమో, నేను ఊహించలేను.''

'మరి విందుకు రారు?''

'అది వారినే అడగాలి!'

'అడిగాను. ఒకమారు కాదు లక్షమార్లు. ఒక్కటే జవాబు! తీరికలేదు అని. క్షణం వృధాగా గడపరట! వింతసేపూ— వృత్తి ధర్మమే సర్వమూ అంటారు—'

'అలాగా! ఈ పార్టీలకు వచ్చి సమయం వృధాపుచ్చడం కంటె— వారు యీ కాస్సేపు యేదో ఉద్యోగ సంబంధమయిన పనులే చేస్తూ వుంటారన్నమాట! అవును ఉమా! వృత్తి ధర్మాన్ని శిరోధార్యంగా తీసుకున్న వాళ్ళు ఒక్క క్షణం కాళీగా కూర్చోలేరు.'

'దానికైనా విధి విరామం వుండవద్దూ టే. మనసుకు కాస్త రిఫ్రెష్‌మెంట్ వుండా లంటావా వద్దా?'

'ఆ విషయం వారికి తెలియదంటావా? అయితే యీ రిఫ్రెష్‌మెంటు అందరికీ ఒకేలాగ దొరుకుతుందా? ఎవరెవరి మన స్థితిని బట్టి వాళ్ళకు—'

'మువ్వు లక్షచెప్పు కోటిచెప్పు, ఒక్కటే నిజం. మనసువిప్పి నీతో చెబుతున్నాను. వారికి నేనంటే లక్ష్యంలేదు. నాకోసం ఒక్క క్షణం అయినా కులాసాగా గడపలేరు నన్ను వంటరిగా వదిలేసి తను వ్యావృత్తులలో మునిగిపోతారు. నాకు యీ యేకాంతమే చెఱ అవుతుంది!' అంది ఉమ.

ఆమె కంఠం గాద్గదికం అయింది.

ఇందిరకు పరిస్థితి అర్థం అయింది.

కాని తను యింకేం మాట్లాడాలో అర్థం కాలేదు.

ఏమని— ఎట్లా— మాట్లాడి ఉమను అనునయించడం?

ఆమె చాల దారుణంగా ఊహించు కుంటోంది భర్తను గురించి— అందుకు ఆమెకు బలమయిన కారణాలు కూడా వున్నాయి. వాతావరణం బలంగా వుంది. కాని అతను మటుకు— ప్రసాద్— యివేవీ లెక్క చేయకుండా తిరుగుతాడు కావున్ను! తన ఉద్యోగం ఏమిటో తను యేమిటో తప్ప యీ గొడవలన్నీ పట్టించుకోడు కావున్ను! అతని వృత్తికి వ్యావృత్తికి అదే సమంజసం అయివుండవచ్చును. కాని ఉమ పాపం వెర్రిగా ఆలోచనలలో పడిపోయి మరోలా భావించు కొంటోంది గదా! జీవితంలో నైరాశ్యాన్ని పెంచుకొని మానసికంగా కుంగిపోతోంది.

కారు ఉమ యింటి ముందు ఆగింది.

ఉమ దిగి 'రా ఇందిరా. కాసేపుకూర్చొని వెళుదువుగాని' అంది.

ఆమె ఆలోచనలలో మంచి తేరుకుని 'కాదు. వెళ్ళాలిలేవే రేపు వస్తాను' అంది.

ఉమ అంతగా బలవంతం చేయలేదు.

ఇందిర కారు నడువుకు ముందుకు వెళ్లిపోయింది.

ఉమ యింటిలోనికి నడిచింది.

కాంతమ్మ ఎదురయింది.

'తొందరగా వచ్చేశారే అమ్మగారు' అని పలకరించింది.

'ఇంకా వారు రాలేదా కాంతమ్మా'

'రాలేదండీ'

ఉమ సరాసరి మేడమీదకు వెళ్ళింది. తన గదిలోకి వెళ్ళి సోఫాలో వాలిపోయింది. వారింకా యింటికి రాలేదు, విందు సంగతి


పవిత్ర రుద్రాక్ష

1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపువచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు, శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్ఠమైన రాళ్ళు, లభించును. కోరినవారికి ధరలపట్టి పంప బడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.

**Shree Jagdamba Bhawan**
**(A.M.)** SONEPAT.131001.

తెలుగు పుస్తకాలు

| | |
|---|---|
| కాశీరామేశ్వర మజిలీ కథలు | రు. 15/- |
| గృహ వైద్యదీపిక 280 రోగాలకి | రు. 10/- |
| కొక్కోకము (కామసూత్రాలు) | రు. 10/- |
| అనుభవ వైద్యం అన్ని రోగాలకి | రు. 20/- |
| వర్తకమర్మాలు (కుటీర పరిశ్రమలు) | రు. 15/- |
| టైలరింగ్ బుక్ (బొమ్మలతో) | రు. 15/- |

4 పుస్తకములకు పోస్టేజి ఉచితం.

ఉషా బుక్ సెంటర్,

గాంధీనగర్, తాడేపల్లిగూడెం - 1 (A P.)

డా॥ పి. వి. కె. రావ్, B. A.,

వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్.



వివాహము వాయిదా వేయ నవసరము లేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్రస్ఖలనములకు ఆయుర్వేద చికిత్స.

పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్,

టి. బి. రోడ్, తెనాలి,

ఫోన్: 700, 1010.

ప్రఖ్యాతి చెందిన!

ఖటావ్ మిల్లు వారి

★ 100% పాలియస్టర్ చీరలు..

★ ఫుల్‌వాయిల్, ఆఫ్ వాయిల్ చీరలు

★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు

★ డ్రస్ మెటీరియల్సు, 2x2 రూబియాలాన్సు

★ స్కూలు యూనిఫారంలు ....వగైరాలకు

విజయ షోరూమ్

ప్రత్యేక ఖటావ్ మిలు వస్త్రముల షోరూమ్

మీకు వివాహం కాలేదా ? ఉద్యోగం రాలేదా ?
సంతానం కలుగలేదా ? మీకు లాటరీలో డబ్బు వస్తుందా ?
మీకు పై అవకాశాలు మీ జీవితంలో ఉన్నవా – లేవా? అన్ని విషయాలు తెలుసు కోవాలంటే ప్రఖ్యాత దేశ, విదేశీ జ్యోతిష, సంఖ్యా,రత్న శాస్త్రవేత్తద్వారా తెలుసుకోండి.
వివరాలకు :
GEMMOLOGICAL RESEARCH INSTITUTE,
C/o Post Box No. 42, ONGOLE (A.P.)


నూతన యవ్వనం పొందండి. సంతాన వంతులు కండి !
చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి !!
హస్తప్రయోగము వలన కలుగు నరముల బలహీనత శీఘ్ర స్ఖలనము అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేక పోవుట. సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స. పోస్టుద్వారా చికిత్సకలదు.
ప్రతి ఆదివారము భీమవరం షణ్ముఖ లాడ్జినందు
ఉ. 9.నుండి సా. 6—30 వరకు క్యాంపు కలదు.
డా॥ డి. మార్కండేయులుఆయుర్వేద భిషక్, సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్టు,
పిచ్చుకరోడ్, గుడివాడ - 521 301 ఫోన్ : 522 & 540.







వెలువడినవి
గోపీచంద్ నవలలు
అసమర్థుని జీవయాత్ర 10·00
పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా 15·00
యమపాశం 12·50
డీలక్స్ పబ్లికేషన్స్
ఏలూరురోడ్. విజయవాడ-2


## విధి చాల సుఖమా?

మరచిపోతే పోయినారు, యింటి సంగతి మగవారా యేమిటి? ఉమకు చాల చిరాకు అనిపించింది.

కాంతమ్మ గదిలోనికి వచ్చింది.

'అమ్మగారూ రేడియో పెట్టమంటారా?'

'ఊఁ'

ఏదో సంగీతం, వెలువలా వస్తోంది రేడియోలోంచి.

ఉమ యాంత్రికంగా వింటోంది.

ఆమె మనస్సు మాత్రం అక్కడలేదు. సంగీతాన్ని గురించి, దాని మాధుర్యాన్ని గురించి ఆలోచించే స్థిమితంలేదు.

కాంతమ్మ అటు యిటు తిరిగి బయటకు వెళ్ళిపోయింది.

ఉమ దుస్తులయినా మార్చుకోలేదు.

ఆమె ఆలోచనలన్నీ భర్తను గురించే.

వారింకా యింటికి రాలేదేమని! తనను యిలా అలక్ష్యం చేస్తూ వుంటే యికముందు తనయినా యేం చేస్తే బాగుంటుంది అని ఆలోచిస్తోంది.

తను కాపురానికి వచ్చింది లగాయితు యీనాటి వరకూ తమ దాంపత్యం ఎలా గడచింది? ఎక్కడ యెన్ని మలుపులు తిరిగిందీ స్ఫురణకు తెచ్చుకుంది.

ఆమె యిలా ఆలోచించుకుంటూ వుండగానే కాంతమ్మ మళ్ళీ గదిలోనికి వచ్చింది

'అమ్మగారూ! వంట మనిషి వెళ్ళిపోతానంటోంది భోజనానికి లేస్తారా?'

–ఉమకు యెక్కడినించో కిందకు పడిపోయినట్లు అనిపించింది. మనసు ఒక్కమారుగా ఉలిక్కిపడింది.

ఏమిటి?... అన్నట్లు కాంతమ్మ వంక చూసింది.

కాంతమ్మ యిందాక చెప్పిన మాటలవే మరింత సునితంగా చెప్పింది.

'టైం ఎంతయింది?' అంది ఉమ గడియారం వంక తను కూడా చూస్తూనే.

'ఏమిటిదిన్నర ! అబ్బ – గంటసేపు ఒక్కర్తినీ యిక్కడ దిగాలుగా వంటరిగా కూర్చున్నానా? ఏంచేస్తున్నాను, యిందాకటి నుంచి – ఒంటరిగా ఆలోచించుకుంటూ కూర్చుంటే వెర్రెత్తిపోతుంది. చివరకు తన మనస్సు కూడా శరీరం మళ్ళేనే యాంత్రికంగా లాంఛన ప్రాయంగా తయారవుతోంది.

## నిధి చాల సుఖమా?

అవును ! వినిమిదిన్నర అయింది.

వంటమనిషి డ్యూటీ అరగంట కిందటే అయిపోయింది; లెక్కప్రకారం కాని మంచిది. తన కోసం గౌరవం కొద్దీ అరగంట వోపిక పట్టి కూర్చుండిపోయిందన్నమాట.

'అయ్యగారు యింకా రాలేదుగా !...'

'వంటమనిషిని వెళ్ళిపొమ్మను, నేనూ తరువాతనే భోంచేస్తాలే.'

కాంతమ్మకు యింతకంటె కొత్త జవాబు రాదని తెలుసు అందుకు తల వంచుకుని నిమ్మళంగా వెళిపోయింది.

ఉమ సోఫాలో నుంచి లేచింది.

కాస్సేపు గదిలో అటూ యిటూ తిరుగాడింది. ఏంచేయాలో తోచడంలేదు. ఏం చేయవలసిందీ కనిపించలేదు.

ఆయన యిప్పుడే కాకపోయినా యింకో అరగంటకో, గంటకో రానే వస్తారు. రాగానే స్నానం చేస్తారు. తరువాత భోజనం. అనంతరం నిద్ర

దైనందిన కార్యక్రమంలో యేమీ లోటు వుండదు. నిద్రపోయేముందు యేదయినా పుస్తకం చూచుకుంటారు. ముభావంగా తనతో మాట్లాడుతారు ఏవయినా ప్రశ్నలు వేస్తే జవాబు చెబుతారు. వారిని చూస్తూ వుంటే హాయిగా, జాలిగా వుంటుంది. ఎంత శ్రమపడి వచ్చారు, అనిపిస్తుంది ముందు. తరువాత మటుకు యింత శ్రమ యెందుకు పడాలి? ఇంత శ్రమ లేకుండా కాలుమీదకాలు వేసుకుని కూర్చుంటె రోజులు గడిచిపోయే అవకాశం వున్నప్పుడు, ఎందుకు యిట్లా కాలమంతా వృథాగా బయట గడపాలి— అని కోపం వస్తుంది.

ఉమ దుస్తులు మార్చుకుని పక్కమీదకు చేరింది.

దీపం ఆర్పేసి బెడ్‌లైట్ వేసుకుని అలమరలోనుంచి ఒక పుస్తకం తీసుకుంది. పడుకుని చదువుకుందుకు ప్రయత్నించింది. ఆయనను గురించిన ఆలోచనలన్నీ ఒక మూలకు నెట్టి పుస్తకంలో మునిగిపోవటానికి ప్రయత్నించింది. కేవలం కాలక్షేపం కోసం చదువుకునే పుస్తకం కనుక శ్రమ లేకుండా పేజీలు తిరిగిపోతున్నాయి.

కాంతమ్మ మళీ గదిలోనికి వచ్చింది.

ఉమ తన రాక గమనించిందని తెలుసుకున్నాక, ఒకమూల ఒదిగి కూర్చుంది.

కాంతమ్మకు యేదో మాట్లాడాలని వుంది కాని అమ్మగారు చదువుకుంటున్నారు అని భయపడి ఊరుకుంది.

### 2

బయటకు వెళిన పని ముగించుకుని ఆఫీసుకు తిరుగుముఖం పట్టేటప్పటికి సాయంత్రం అయిదు గంటలయింది; తిన్నగా తన గదిలోకి వెళ్ళి కూర్చుని కాగితాలు తిరుగవేయ సాగాడు

అరగంట గడిచింది.

ఇంటికి వెళ్ళిపోదామనుకున్నాడు. అనుకోవడంతోటే యిది జ్ఞాపకం వచ్చింది.

పాపం, ఉమ తనను ఎప్పటి మాదిరిగానే పెందరాళే యింటికి రమ్మని చెప్పింది. ఇవాళ యేదో స్పెషల్ ఫంక్షన్ ఉన్నదనీ, తను తప్పకుండా రావాలనీ గుర్తుచేసింది కూడా. కాదనలేక తలఊపాడు అప్పుడు. ఇప్పుడు అసలు అందుకోసం వెళ్ళే ఆలోచనే లేదు.


ఉమ తనకోసం ఎదురుచూచి వంటరిగా వెళ్ళి వుంటుంది తను రాడని రూఢిగా తెలిసినా ఎదురు చూడడం మటుకు మానదు. తనలో అంత నమ్మకం యేమిటో పాపం, ఉమకు.

ప్రసాద్ ఆఫీసు నుంచి బయలుదేరాడు. ఎక్కడికని వెళ్ళడం?

ఇవాల్టికి తన కార్యక్రమం అంతా ముగిసి పోయింది. అనుకున్న పనులన్నీ సక్రమంగా పూర్తయినాయి ఇక యేం చేయాలి? ఒక్క క్షణం వృథాగా గడపడం యిష్టం లేక తను రోజల్లా చేసినా పరిపోని పనులన్నీ ప్రతి రోజూ కేటాయించుకుంటాడు. అవన్నీ తన మీద పగతీర్చుకున్నట్టుగా ఒక్కొక్కరోజా చక చక అయిపోయి, తనకు ఎదురు చూడని విరామాన్ని కలిగిస్తూ వుంటాయి ఒక్కక్షణం ఖాళీగావుంటే తనకు తోచదు. కాని అనుకున్న పనికంటె ఎక్కువగా చేయడం కూడా తన అభిమతానికి వ్యతిరేకమే.

ప్రసాద్ తిన్నగా యింటికి వెళ్ళిపోయి విశ్రాంతి తీసుకుందామనుకున్నాడు. ఇంటికి వెళ్ళవచ్చును, ఇంక ఉమ తన కోసం ఎదురు చూస్తూనే వుంటూంది. తనను చూచిందంటే-అందునా యీ క్షణంలో - ఆమెకు పంచప్రాణాలు లేచివచ్చినట్టు అవుతుంది. వెంటనే క్లబ్బుకు ప్రయాణం చేయిస్తుంది. ఈ సమయంలో యిలా ఎదురుపడినాక కాదనడం కష్టం. అందుచేత యింటికి వెళ్ళడం అనే పని కనీసం ఒక అరగంట సేపయినా వాయిదా వేస్తేగాని బాగుండదు అనిపించింది.

ఏమిటో చిన్నతనం నుంచి తన ప్రకృతి యిలాగే వుండింది. కులాసాగా కాలక్షేపం చేయాలనే తన అభిమతం. అయితే 'కులాసా' విషయంలో యితరుల అభిప్రాయాలకు తనీ అభిప్రాయాలకూ యెక్కడా సాపత్యం అగుపించదు. తన పద్ధతి తనకు అనుకూలం



వాత్స్యాయన ప్రయోగము - వశీకరణ శిల్పము
# సెక్సు హాస్పటల్

దురభ్యాసాలకు లోనై దాంపత్య సౌఖ్యం అనుభవించ లేనివారు వెంటనే సంప్రతించండి!
డా॥ A. పూర్ణచంద్రరావు
(సెక్సు స్పెషలిస్టు) N.D.F.M.F.U.(CEYLON) R.A.M.P.
గవర్నరుపేట, మ్యూజియం రోడ్, విజయవాడ-2 (A.P.)
ముఖవ్యాధులకు ప్రత్యేక చికిత్స
Phone No. 63753

లక్షలాది ప్రజలు మెచ్చుకొనే
**ఉత్తమ ప్రమాణ గ్రంథాలు**

| | | |
|---|---|---|
| 1. | ఎలక్ట్రికల్ వైరింగు & కటింగు గైడు | రు. 15 |
| 2. | కోకశాస్త్రం [112 ఫోటోలు] | రు. 15 |
| 3. | 68 పడకగది ఫోటోలు | రు. 15 |
| 4. | ఫోటోగ్రఫీ | రు. 15 |
| 5. | కామశాస్త్రం | రు. 15 |
| 6. | ప్రైవేటు ఫోటో ఆల్బం | రు. 30 |
| 7. | డ్రాయింగ్ & పెయింటింగు | రు. 15 |
| 8. | వివాహపు జీవితం | రు. 15 |
| 9. | రేడియో & ట్రాన్సిస్టర్ గైడు | రు. 20 |

పోస్టేజి అదనం.
**STAR BOOK DEPOT** (A.P.)
Chhapeti, Aligarh.

**లైసెన్సు అవసరం లేదు**
ఆధునిక పద్ధతులతో పరీక్షమైన ఇనుముతో తయారుచేయబడిన ఎక్స్‌పోర్టు క్వాలిటీ 6 షాట్ ఆటో మేటిక్ పిస్టల్. పిడుగులాంటి శబ్దముతో భయంకరమైన మంటనిచ్చును. క్రూరమృగములు, దొంగలు మరియు ప్రమాదముల నుండి రక్షించును. మీరు 6 షాట్లు ఒకదాని వెనుక ఒకటి వరుసగా కాల్చవచ్చును.


ధర రూ. 66-50 మాత్రమే. లెదర్ కేసు మరియు 100 బుల్లెట్లు ఉచితం. అదనపు బుల్లెట్లు 100కి రూ. 5/-. పోస్టేజి రూ. 8-50
VIJAY AGENCY (A-II)
CHHAPATI, ALIGARH



గానే వుంది కాకపోతే ఉమకు మటుకు యిలా పొగడం యిష్టం లేనట్టు అప్పుడప్పుడూ స్పష్టం అవుతూనే వుంది.

విందులు వినోదాలు అనే పేరిట సోషల్ గాదరింగ్స్ జరగడం. అక్కడ పనిలేని పెద్ద అందరూ చేరి ప్రపంచాన్ని తామంతా శాసిస్తున్నామన్నధీమాతో చల్లగా కాలక్షేపం చేసి కడుపారా తిని తాగి కులాసాకోసం ఆడపిల్లల నృత్యమో ప్రత్యేక ప్రదర్శనలో తిలకించి అర్థరాత్రివేళయిళ్ళకు దూరడం- యిదంతా తల్చుకుంటూ వుంటేనే ప్రసాద్‌కు తీరని అసహనం వేస్తుంది. నిక్షేపంలాంటి కాలాన్ని దుర్వినియోగంచేయడంకాకపోతే యేమిటి యిదంతా?

అందుకనే తను యిటువంటి వాటికి వీలయినంత దూరంగా వుంటూ వచ్చాడు. అది తన కాలాన్ని ఆక్రమించుకుని తన మనస్సును ఆకట్టుకోకుండా జాగత్తపడుతూ వచ్చాడు.

ఎటు పోవటానికీ ప్రత్యేకించి యేమీ వుద్దేశ్యం లేకుండా కారును ముందుకు పోనిస్తున్నాడు, నెమ్మదిగా దారిలో ఎవరయినా కనిపిస్తే బాగుండును- కాస్త కాలక్షేపం అవుతుంది, అనుకున్నాడు. కాని కావాలనుకున్నప్పుడల్లా యిట్టే కనిపిస్తారా స్నేహితులు? వాళ్ళు తమ తమ కార్యకలాపాలలో మునిగిపోయి సతమతమవుతూ వుంటారుగాని యిలా యేమీ తోచక కొట్టుమిట్టులాడుతున్న తనకోసం వెదుకుతూ ఎదురుగా వస్తారు కనకనా?

ప్రసాద్- నింపాదిగా కారునడుపుకుంటూ రోడ్డుమీద వెడుతున్న జనాన్ని చూస్తున్నాడు ఈ మహా నగరంలో పేవ్‌మెంట్ల మీద ఏ క్షణంలో చూచినా జనం ప్రవహిస్తూ వుంటారు. అందరికీ యేదో హడావడి. ఏదో తొందర. ఎన్నో పనులు బుజాన వేసుకుని జనం పరుగులు తీస్తూ వుంటారు. ఒకరికీ నిలబడి 'యేమిటి యీ జనం? యేమిటి యీ నడక?' అని ప్రశ్నించుకునే సమయం వుండదు. ఒక రకంగా చూస్తే ఈ జనం నడవడం లేదేమో అనిపిస్తుంది. రోడ్లే వీళ్ళ బరువుకు కుంగిపోయి దిక్కున్నచోట చెప్పకోవటానికి పారిపోతున్నాయేమో ననిపిస్తుంది.

ఈ ఆలోచన రావడంతోటే ప్రసాద్‌కు నవ్వు వచ్చింది. జనాన్ని చూచి కాదు- తన ఆలోచనకే.

ఉన్నట్టుండి అతని దృష్టి తన కారు పక్కగా వెడుతున్న మనిషి మీద పడింది.

ఎవరతను?

ఎక్కడో చూచినట్టు వుందే- అనుకున్నాడు.

బాగాపరిచయంఅయినముఖంఅనిపిస్తోంది.

రోజూ వేలకొద్దీ ముఖాలు చూస్తూ వుంటాం. వీన్నని గుర్తుపెట్టుకోవడం?... కాదు! ఈ మనిషి తనకు బాగా పరిచయం అయినవాడు అనిపించింది.

అతను తనను చూడనేలేదు.

చూస్తే అతనే పలుకరించేవాడేమో!

ఈసరికి ఆ మనిషి కాస్త దాటిపోయినాడు.

ప్రసాద్ రేర్ మిర్రర్‌లో నుంచి అతన్ని గమనించాడు. ఆ నడక కూడా తనకు సుపరిచితమేననిపించింది. ఈ పరిచయం అయిన మనిషిని యిప్పుడు వదిలేస్తే లాభంలేదనిపించింది. కారు వెనక్కి నడిపించాడు.

అతను మాత్రం తన దారిన తాను నడుచుకుంటూ తల వంచుకు వెళ్ళిపోతున్నాడు.

ప్రసాద్ అతనికి పక్కన కారు ఆపాడు. తన పక్కన కారు ఆపిన సంగతి కూడా ఆ మనిషి గమనించినట్టు లేదు. చేతిలో 'పేపరు' ఊపుకుంటూ తన దారిన తాను నడుచుకు పోతున్నాడు.

ప్రసాద్ కారు రోడ్డువార ఆపి తనూ దిగివచ్చాడు.

'ఏమండీ మిమ్మల్నే' అన్నాడు.

కాని ఆ మనిషి వెనక్కు తిరిగి చూడనే లేదు.

ప్రసాద్ మళ్ళీ పిలిచాడు. రెండడుగులు ముందుకు వేసి అతని చేతిని తట్టాడు. ఈమారు అతను ప్రసాద్ వంక చూచాడు. ప్రసాద్ 'మిమ్మల్నే పిలుస్తున్నాను' అన్నాడు.

ఆ మనిషి 'ఎవరు నువ్వు?' అని అడగ లేదు గాని ఆ ప్రశ్న వేసినట్లే ముఖం పెట్టాడు.

'నా పేరు ప్రసాద్, మనం యిద్దరం పూర్వ పరిచితులం. మరచిపోయినారా?' అనడిగాడు ప్రసాద్, చొరవచేసి.

నిజానికి ఈ మాటలు అతని నోటివెంట

**తారల ఫొటోలు**

శ్రీదేవి., జయసుధ., జయప్రద., జయమాలిని, సుజాత., మాధవి., ప్రభ., కవిత., ప్రయనార్, ఎన్టీఆర్., శోభన్‌బాబు., కృష్ణ., కృష్ణంరాజు, మోహన్‌బాబు., కమలహాసన్., చిరంజీవి! వీరిలో ఎవరి ఫొటో కావాలన్నా ఫొటోకి 3 రూ॥లు. ఎం.ఓ. చేయాలి....! ఫొటోలతోపాటు సినీతారల అడ్రసులున్న పుస్తకం కూడా పంపబడును!

ఎవరి ఫొటో కావాలో వ్రాయడం మరువకండి!

**వై.కె. మూర్తి.**

[illegible] విజయవాడ-2.



**దీర్ఘవ్యాధులకు ఉత్తమవైద్యం**

దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యం పొందలేనివారికి హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టుద్వారా వరిబీజం(బుడ్డ) ఇస్నోఫీలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ (గ్యాస్ట్రిక్) మూత్ర, స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి

**డా॥ దేవర**

1/1 బ్రాడీపేట, గుంటూరు. A.P.



బైద్యనాథ్ వారి సమర్పణ




# బైద్యనాథ్ మాదీఫల రసాయనము

సదుపాయకరమైన 60 మి. లీ. మరియు 200 మి. లీ. ప్యాకింగులలో అన్ని మందుల దుకాణములలో లభించును.

శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్ ప్రపంచమునందలి అతి పెద్ద ఆయుర్వేద ఔషధ నిర్మాణ సంస్థ నేడు ప్రజాసేవలో **"బైద్యనాథ్ మాదీఫల రసాయనము"**ను ప్రవేశ పెట్టుచున్నారు. అజీర్ణము, అగ్నిమాంద్యముల యందు మరియు పైత్యవికారము, వాంతులయందు అత్యుత్తమముగా పనిచేసి జీర్ణశక్తిని పెంపొందించుటలో మేటి అయిన రుచికరమైన ఔషధము.

విక్రయకేంద్రము 21-7-802, హైకోర్టుఎదురుగా హైదరాబాద్-2
ఫోన్ నెం : 47068

**శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్**

బైద్యనాథ్ ప్రాచీన ఆయుర్వేద గ్రంథములననుసరించి 700 రకముల ఆయుర్వేద ఔషధములు కలకత్తా, పాట్నా, ఝాన్సీ, అలహాబాద్ మరియు నాగపూరులలోని 5 కర్మాగారములలో అత్యంత అధునాతన పద్ధతిలో తయారుచేయబడుచున్నవి.

బైద్యనాథ్ ఔషధాలు 800 విక్రయశాలలు మరియు 60,000 ఏజన్సీలు మరియు ఔషధ విక్రేతలద్వారా భారతదేశమంతటా లభించుచున్నవి.

INTERMARK/MPR 18T


## విధి చాల సుఖమా?

ఆ ప్రయత్నంగా వచ్చేశాయి. అతను ప్రసాద్‌ను తీగాదిగా చూచాడు.

రెండు మూడు క్షణాలు గడిచాయి.

ఆ కొత్త మనిషి ముఖంలో ఒక రకమైన 'కాంతి' ప్రవేశించింది. పాత జ్ఞాపకాలు స్ఫురణకు తెచ్చుకుంటున్న ప్రయత్నం — అది ఫలించిన తీరు అతని ముఖంలో వినూత్నమయిన వికాసాన్ని కలుగచేశాయి. ఈ వికాశానికి నిలదొక్కుకోలేక అతను ప్రసాద్ చేతులను తన చేతుల్లోనికి తీసుకుని అతన్ని దగ్గరకు లాక్కున్నాడు. కౌగలించుకున్నాడు.

'హలో ప్రసాద్ గుర్తించలేక పోయినాను. క్షమించు–'

ఇద్దరి ప్రాణమూ ఒక్కమారుగా కుదుటపడినట్టు అయింది.

'అకస్మాత్తుగా చూచాను చూడగానే గుర్తించాను కారు ఆపి మీ వెనకాలే వచ్చేశాను—' అన్నాడు ప్రసాద్, స్నేహితుడి చేయి యింక వదలకుండానే.

'మనం విడిపోయి చాలకాలం అయింది. అందుకని వెంటనే గుర్తు రాలేదు' అన్నాడు ఆ మిత్రుడు.

'మరేం ఫరవాలేదు కాంతారావ్ – రా – వెళ్ళి కారులో కూచుని మాట్లాడుకుందాం' అంటూ ప్రసాద్ అతన్ని తన కారు దగ్గరకు నడిపించుకు వెళ్ళాడు.

కాంతారావు క్షణంపాటు ఆలోచించాడు.

'ఎక్కడికి వెడదాం ?' అని అడిగాడు గడియారం వంక చూసుకుంటూ

'యేం, యేదయినా యెంగేజ్‌మెంట్ వుందా ?'

'యేంలేదు, యింటికే వెడుతున్నాను. తొందరయేంలేదు.'

'అలా యెక్కడయినా యేకాంతంగా వుండేచోట కాస్సేపు కూచుందాం. మనం కలుసుకుని పదేళ్ళు దాటిపోయింది తెలుసా ?' అన్నాడు ప్రసాద్.

ఇద్దరూ కారులో కూర్చున్నారు.

కారు ముందుకు నడిచింది

దారిలో యిద్దరూ మౌనంగానే వుండిపోయారు.

నిజానికి ప్రసాద్‌కు మాట్లాడాలని వుంది. కాని ఏం మాట్లాడాలో తెలియడంలేదు.

(ఇంకా వుంది)